క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

కార్మికులకు వేతనాలు అందించాలి

ఆదోని రూరల్: మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ (ఆప్కాస్) కార్మికులకు వేతనాలను సకాలంలో అందించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు, జిల్లా సహాయ కార్యదర్శి మున్సిపల్ కార్మిక సంఘం బాధ్యుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత నెలకు సంబంధించిన వేతనాలు ఇంకా విడుదల కాలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణాధ్యక్షులు వై.టి.భీమేష్,ప్రధాన కార్యదర్శి బి.వెంకన్న, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జాన్‌బాబు, ఉరుకుందు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మిగనూరురూరల్: గర్భిణి, బాలింతలకు పౌష్టికారహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ నీలమ్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని బోడబండ గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణ మహాలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ర్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, గర్భవతులు, బాలింతులు, గ్రామస్తులు తదితరలు పాల్గొన్నారు.

పరామర్శ



కర్నూలు ఆసుపత్రిలో నాగప్పను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందవరం మండలంలోని నాగలదిన్నె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగప్పను సోమవారం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, యూత్ నాయకుడు ఎర్రకోట పవన్‌కళ్యాణ్ రెడ్డిలు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయనకు ధైర్యం చెప్పి అక్కడి వైద్యులతో చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కందనాతి వేణుగోపాల్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, నాగలదిన్నె రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు మెంబర్ చాంద్‌తాత కుమారుడు తాహిర్ బాషా రెండు వారాల క్రితం మంత్రాలయంలోని గోశాల వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగివచ్చారు. సోమవారం విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, సీనియర్ నాయకులు రామకోటేశ్వరరెడ్డిలు తాహిర్‌బాషాను పరామర్శించి తగిన జాగ్రత్తలు చెప్పారు.

ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్య, వైద్య, సాగునీటి పరంగా వెనుకబడిన జిల్లాలోని పశ్చిమ ప్రాంతం అభివృద్ధికై ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు డాక్టర్ కామలే గణేష్, కరెకృష్ణ, బతకన్న, సత్యన్న, స్వామిదాసు, నీలకంఠ, గోట్ల చంద్రశేఖర్, ఈరన్న, వి.జి.వెంకట్రాముడులు డిమాండ్ చేశారు. సోమవారం ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేసి, పలు డిమాండ్లతో కూడిన విన తిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, అనీఫ్, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

మోసాలకు పాల్పడితే చర్యలు



కాటాలను పరిశీలిస్తున్న తూనికలు, కొలతల అధికారి వైజీ శంకర్

పెద్దకడబూరు : డీలర్లు కార్డుదారులకు అందించే సరుకులలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని తూనికలు, కొలతల అధికారి వైజి శంకర్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం మండలంలోని అన్ని గ్రామాల రేషన్ దుకాణాలలో ఉన్న తూనికలను తెప్పించి పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణ యూనిట్లు పాటిస్తున్నారా లేదా? పరిశీలించి 38 కాటాలకు సీల్ వేశారు.

డిజిటల్ బుక్‌తో పార్టీ శ్రేణులకు భరోసా

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి
- డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వ ఆగడాలతో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులకు భరోసా ఇచ్చేందుకే డిజిటల్ బుక్‌ను మాజీ సీఎం వైఎస్ జగనన్న రూపొందించారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి నివాస ఆవరణలోఎంపీపీ కేశన్న, పార్టీ సీనియర్ నాయకులు సోగనూరు భీమిరెడ్డి, కోటేకల్ లక్ష్మన్న, రంగస్వామి, బాస్కర్‌లతో పాటు పార్టీ శ్రేణులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వారిపై కూటమి నాయకుల దాడులు, అక్రమ కేసుల బనాయింపులు పెరిగిపోయాయన్నారు. అలాంటి వారి వివరాలను బాధిత వైఎస్సార్‌సీపీ శ్రేణులు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డిజిటల్ బుక్‌లో నమోదు చేయాల్సి వుంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకునేవరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోనెగండ్లలో డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, నాయకులు

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

గోనెగండ్ల : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, అన్యాయాలకు గురైన శ్రేణులకు డిజిటల్ బుక్ అండగా నిలుస్తుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం గోనెగండ్లలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి అలువాల ప్రమోద్ కుమార్ రెడ్డితో పాటు పార్టీ నాయకులతో కలిసి మండల కన్వీనర్ డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చికెన్ రాజా, నాయకులు ఎస్‌బీ మన్సూర్, అగ్రహారం నాగిరెడ్డి, దొరబాబు, ఇమ్రాన్, గోవింద్, పద్మనాభం, బందెనవాజ్, గంగాధర్, జయపాల్, నబి, బజారి, దేవేంద్ర, నాగేష్, వెంకటేష్, తిక్కయ్యస్వామి, సుందరాజు, వల్లభుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులకు రక్షణ

నందవరం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన డిజిటల్ బుక్‌తో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు రక్షణ కల్పిస్తుందని రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంత రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి విరుపాకిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రం నందవరంలోని ఆర్టీసీ ప్రాంగణంలో క్యూర్ కోడ్ పోస్టర్లను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగిన సమయంలో గాయాలుంటే ఫోటోలు డిజిటల్ బుక్‌లో అప్‌లోడ్ చేయవచ్చన్నారు. అలాగే ఐవీఆర్ఎస్ విభాగంలో ఫోన్ నెంబరు 040-49171718 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి, గ్రామ సర్పంచ్ తోట సావిత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రామకోటేశ్వరరెడ్డి, గురజాల నరసింహారెడ్డి, సోమశంకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల సంపత్‌గౌడ్, నరసింహులు, రమేశప్పగౌడ్, ఎల్లాగౌడ్, సూర్యప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నందవరంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

●సరస్వతీ..నమస్తుభ్యం



ఎమ్మిగనూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



వీవర్స్ కాలనీలో సరస్వతిదేవిగా ..



ధాన్యాల అలంకరణలో మహాయోగి లక్ష్మమ్మవ్వ



సరస్వతి అలంకారంలో ఫారెస్ట్‌లైన్ అంభాభవాని



ఆదోని ఎంఎం కాలనీ మాతా పరమేశ్వరిదేవి



ఆదోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



గురజాల క్షేత్రంలో పార్వతీ దేవి



కోసిగిలో చౌడేశ్వరి దేవి



పెద్దకడబూరులో దుర్గా దేవిగా చౌడేశ్వరిదేవి



సోమలగూడూరులో సరస్వతి దేవిగా..



మంత్రాలయంలో ఏర్పాటు చేసిన బొమ్మలకొలువు

సాక్షి నెట్‌వర్క్ : శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవార్లు సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి



ప్రజాసమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను ఆయన స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీవో తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి, ఏడీఏ బాలవర్ధిరాజు, ఖాద్రి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆర్‌అండ్‌బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



నిరసన తెలియజేస్తున్న పాలకవర్గ సభ్యులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

- సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదు
- కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నిరసన

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 16వ వార్డు కొడల్‌పేట, బార్‌పేట, తిక్కస్వామిదర్గా, కునిముల్లా ప్రాంతాల్లో మౌలిక వసతులైన మురుగు కాలువలు, సీసీ రోడ్లు, వరదనీటి కాలువలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ 16వ వార్డు కౌన్సిలర్ హసీనాబాను, కౌన్సిలర్లు ఫయాజ్, వసీం, ఉస్మాన్, బాలాజీ, చలపతి, సందీప్‌రెడ్డి ఆందోళన చేపట్టారు. సోమవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. 9 నెలలుగా మౌలిక వసతులు కల్పించాలని ప్రతినెలా జరిగే కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా తమగోడును వినిపించుకునే నాథుడేలేడని కౌన్సిలర్ హసీనాబాను ఆరోపించారు. అధికారుల పనితీరుకు నిరసనగా చైర్మన్ పోడియం వద్ద బైఠాయించారు. రేపు, మాపు అంటూ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్పా సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపడం లేదన్నారు. దీంతో తాము వార్డులో ప్రజలకు ముఖం చూపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైస్ చైర్మన్ నరసింహులు ఆరోపించారు.

వరద బాధితులను ఆదుకోవాలి..

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని మురుగు కాలువలు పూడికతో నిండిపోయి వరదనీరు ఇళ్లల్లోకి వస్తున్నాయని, దీంతో ఇళ్లల్లోని తిండి గింజలు, బట్టలు తడిచిపోయి ఆర్థికంగా నష్టపోయామని పాలకవర్గ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వరదల కారణంగా పట్టణంలో రూ.60 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లి నిధులను మంజూరు చేయించాలని కమిషనర్‌ను కోరారు. కోట్లలో వరద నష్టం జరిగిందని, అంచనాలు ఇంకా వేస్తూనే ఉన్నారన్నారు. అలాగే రోడ్లు, కల్వర్టులు, కోతకు గురైలక్షలాది రూపాయలు నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ముందుకురాకపోతే ఆదోని మున్సిపాలిటీలో వరద బాధితులను ఆదుకోవడం కష్టతరమేనని చైర్‌పర్సన్ లోకేశ్వరి, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ఫయాజ్‌అహ్మద్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వారంలో వరద నష్టంపై మరో సమావేశం నిర్వహించి నివేదికలను సిద్ధం చేసుకుని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్దామని కమిషనర్ ఎం.కృష్ణ సమాధానంగా చెప్పారు. ఇందుకు పాలకవర్గ సభ్యులు కౌన్సిల్‌లో తీర్మానం చేశారు.

రాకపోకలు బంద్

కోసిగి: మండల కేంద్రం కోసిగి నుంచి ఎమ్మిగనూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుల రాకపోకలు మూడు రోజులుగా బంద్ అయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎమ్మిగనూరు- కోసిగి మధ్యలో మాలపల్లి- కంబళదిన్నె గ్రామాల మధ్య రెండు వాగులు భారీ ఎత్తున ప్రవహిస్తున్నాయి. దీంతో బస్సులు వెళ్లడం కష్టం మారింది. దసర పండుగ రావడంతో ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎమ్మిగనూరు బస్సులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు కోసిగి నుంచి మంత్రాలయం మీదుగా ఎమ్మిగనూరు నడుపుతున్నారు. సోమవారం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం వెళ్లే భక్తులు బస్సులు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే ఎమ్మిగనూరు నుంచి వచ్చే ఉద్యోగస్తులు మంత్రాలయం మీదుగా ఆలస్యంగా కోసిగికు చేరుకోవాల్సి వచ్చింది. వాగులు తగ్గుముఖం పట్టేవరకు మంత్రాలయం మీదుగా బస్సు సర్వీసులు కొనసాగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎమ్మిగనూరు ఆర్టీసీ డీఎం మద్దిలేటి నాయుడిని సంప్రదించగా.. ఆ ప్రాంతం మీదుగా బస్సు సర్వీసు కొనసాగించలేదన్నారు. విచారణ చేసి నేటి నుంచి ప్రత్యామ్నాయ బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం తక్షణం పంటనష్ట పరిహారాన్ని మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, ఏపీ రైతు సంఘ జిల్లా నాయకుడు కేసీ జబ్బార్ డిమాండ్ చేశారు. సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో రాస్తారోకో, రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

ఆదమరిచి.. ఇరుక్కుపోయి



నీటిలో ఇరుక్కుపోయిన పత్తి దిగుబడుల ఆటోను తోస్తున్న బొలెరో క్యాంపర్

ఆదోని అర్బన్: పట్టణంలోని మాధవరం రోడ్డులో వర్షపునీటిలో పత్తి దిగుబడుల ఆటో ఇరుక్కుపోవడంతో ఆ మార్గంలో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురయ్యారు. మాధవరం, రాయచూరు, మంత్రాలయం, కౌతాళం, ఉరుకుంద పుణ్యక్షేత్రం, సిరుగుప్ప, ఆదోని నుంచి వెళ్లాల్సి ఉంది. అలాగే అక్కడి నుంచి ఆలూరు, బళ్లారి తదితర పట్టణాలకు, ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు దిగుబడులు ఈ మార్గంలోనే తీసుకొస్తుంటారు. ఈ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు, రైతులు ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తోంది.

కూలిన మట్టిమిద్దె

మంత్రాలయం రూరల్ : ఎడతెరిపి లేని వానల కారణంగా మండలంలోని చిలకలడోణలో ఓ ఇంటి పైకప్పు కుప్పకూలింది. గ్రామానికి చెందిన చాకలి వెంకటేష్‌కు మూడు సెంట్లలో పాత ఇల్లు ఉంది. గత వారం రోజులుగా కురిసిన వానలకు మట్టి మిద్దె మొత్తం కూలిపోయింది. కూలిన సమయంలో ఎవరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆయన మరో ఇంట్లో కాలం వెల్లదీస్తున్నారు. తనకు న్యాయం చేయాలని బాధితుడు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు.

వేతనాలివ్వండి

ఎమ్మిగనూరుటౌన్: పాఠశాలల్లో పనిచేసే వాచ్‌మెన్లు, స్వీపర్లకు పెండింగ్ వేతనాలను విద్యాశాఖ సత్వరం మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా కార్మికులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆరు వేల రూపాయాల వేతనంతో కుటుంబాలను పోషించుకొంటున్న ఆయా కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. పండుగ ఉన్నందున వేతనాలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమలో నరసింహులు, నాగరాజు, లక్ష్మన్న, గణేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించండి సారూ!



రోడ్డుపై నిలిచిన నీటిలో నాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయని మున్సిపల్ అధికారులు వెంటనే రోడ్లు పునర్నిర్మించాలని సీపీఎం కార్యదర్శి గోవిందు, నాయకులు రమేష్, అబ్దుల్లా, నరసింహులు, రాజు, రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఓ రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీటిలో నారు వేసి మున్సిపల్ అధికారుల తీరుపట్ల నిరసన తెలిపారు.

రోడ్డు బాగు చేయాలి

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి-ధణాపురం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా ఉందని, వెంటనే రోడ్డును బాగు చేయాలని నాగనాథనహళ్లి గ్రామస్తులు వీరేష, రవి, రాగప్ప, వేమన్న, నగేష్ తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నాగనాథహళ్లి గ్రామస్తులు ధర్నా చేపట్టారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతి పత్రం అందించారు.

వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్ జారీ



నోటిఫికేషన్ జారీ చేస్తున్న కమిషనర్, సిబ్బంది

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు మున్సిపాలిటీ మొదటి గ్రేడ్ నుంచి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా స్థాయి పెరగడంతో పట్టణంలో 35 వార్డులు ఏర్పాటు చేసేందుకు గాను, వార్డుల పునర్విభజనకై మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టీపీఓ రాజేష్, సిబ్బందితో కలిసి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు ఆదోని రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఎమ్మిగనూరులోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల సలహాలు, సూచనల కోసం నోటీస్ బోర్డ్‌లో వుంచుతున్నట్లు తెలిపారు. ఏడు రోజుల్లోగా ప్రజలు వారి సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎంకే గురురాజరావు



మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎంకే గురురాజారావు నియామకానికి ఆమోదం తెలుపుతూ చైర్మన్‌కు పత్రాన్ని ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ (న్యాయవాది)గా ఎంకే గురురాజారావును నియమిస్తూ కౌన్సిల్‌లో మూడవ వంతు సభ్యులు ఆమోదించారు. సోమవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సభ్యుల సాధారణ సమావేశం జరిగింది. కౌన్సిల్‌లో గతంలో మున్సిపల్ న్యాయవాదిగా పని చేసిన ఎంకే. గురురాజారావును తిరిగి నియమించేందుకు సెక్షన్ 84 ప్రకారం మెజారిటీ సభ్యుల్లో మూడవ వంతు సభ్యులు ఆమోదం తెలుపుతున్నామని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ కౌన్సిల్‌లో ప్రకటించారు. మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ పదవి కాలం ఆగస్టు నెల 31వ తేదీకే ముగిసింది. ఇందుకై ఆగస్టు 6న స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది నియామకానికి నోటిస్ ఇవ్వడంతో ఎంకే గురురాజారావు, గురుప్రసాద్, నర్సారెడ్డిలు దరఖాస్తు చేసుకోగా.. వారిలో ఎంకే గురురాజారావును నియమించేందుకు మెజారిటీ సభ్యులు ఆమోదం తెలుపుతూ సంతకాలు చేసిన వినతిని చైర్మన్‌కు అందజేశారు. అయితే మెజారిటీ సభ్యులే లేరని, తీర్మానాన్ని ఎలా ఆమోదిస్తారని టీడీపీ, బీజేపీ కౌన్సిలర్లు అభ్యంతరం తెలిపారు. కాగా, టేబుల్ అజెండాగా తాను స్వీకరిస్తున్నానని, అందులో మెజారిటీ సభ్యుల సంతకాలు వున్నాయని, ఎంకే గురురాజారావును మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమిస్తూ ఆమోదం తెలుపుతున్నామని చైర్మన్ ప్రకటించారు. దీంతో టీడీపీ సభ్యులు కౌన్సిల్ నుంచి వాకౌట్ చేసి వెళ్లి పోయారు.

క్రిటికల్ కేర్ యునిట్‌పై బీజేపీ సభ్యుడికి చైర్మన్ క్లాస్

పట్టణంలోని వందపడకల ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలున్నాయని అయితే క్రిటికల్ కేర్‌పై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని టీడీపీ నుంచి బీజేపీలో చేరిన కౌన్సిలర్ దయాసాగర్ పేర్కొనడంతో చైర్మన్ స్పందించారు. అసలు క్రిటికల్ కేర్ అంటే ఏమిటో తెలుసా అని ప్రశ్నించారు. దీంతో కౌన్సిల్‌లో అందరూ మిన్నుకుండి పోయారు. నేషనల్ హైవే ఉన్నా క్రిటికల్ కేర్ యూనిట్ లేకపోవడంతో ప్రజల ప్రాణాలు గాల్లో కలిసి పోతున్నాయని చైర్మన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్సిజన్ ప్లాంట్, గుండె, యూరాలజీ, న్యూరో, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్ లాంటి వాటికి సంబంధించిన వాటికి నిపుణులైన వైద్యులు ఆస్పత్రిలో అందుబాటులో లేరని, వాటినే క్రిటికల్ కేర్ యునిట్ అంటారన్నారు. అత్యవసరమైన వైద్యానికై రాత్రి వేళల్లో కర్నూలుకు వెళ్లాల్సి వస్తుందని.. ఆలోపే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతకుముందు కౌన్సిల్ అజెండాలోని 18 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో ఉన్న మున్సిపాలిటీ పరిధిలో అదనంగా మరో వార్డు ఏర్పాటు చేసేందుకు, 35వ ఎలక్షన్ వార్డులను పునర్విభజించుటకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు నీరజ, రాజునాయక్, టీపీఓ రాజేష్, ఆర్‌ఓ అస్లాంబాషా తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి

ఆదోని రూరల్: ఆదోని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కరెంటు ఈరన్న, ఉచ్చీరప్ప, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాల యం ఆవరణలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిప త్రాన్ని తహసీల్దారు గీతాప్రియదర్శినికి సమర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఓబులేసు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నందవరం : నందవరాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో మండల కార్యదర్శి గిడ్డయ్య నేతృత్వంలో ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి కాంతప్ప, సీపీఐ మండల సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు తిప్పన్న, రామలింగడు, మినల్ల తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని అంతం చేయడమే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయవ్యాధిని అంతమొందించడమే మన లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ షేకున్‌బాను అన్నారు. సోమవారం పట్టణంలోని శంకర్‌నగర్ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గల్లలో తెమడ, రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం తదితర లక్షణాలు ఉన్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, సుబ్బమ్మబాయి, ఇందు, లలిత, నాగవేణి, ఈరమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.